సంక్రాంతికి సాధ్యమయ్యేనా?

హామీలను గాలికొదిలేసిన కూటమి నాయకులు

సంక్రాంతి పండుగ నాటికి గుంతలు లేని రహదారులు నిర్మిస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి నాయకులకు గుడివాడ-విజయవాడ వయా కంకిపాడురోడ్డు సవాల్ విసురుతోంది. నాలుగు జిల్లాలకు సంబంధించిన ఈ రోడ్డు రెండుగా చీలినట్లుగా మారింది. పలుచోట్ల అధ్వానంగా మారడంతో వాహనచోదకులకు నరకప్రాయంగా మారింది.



అధ్వానంగా మారిన కంకిపాడు రోడ్డు

గుడివాడ టౌన్: కంకిపాడురోడ్డు అధ్వానంగా మారడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. తూర్పుగోదావరికి చెందిన రాజోలు, పశ్చిమగోదావరికి చెందిన భీమవరం, నర్సాపురం, కృష్ణా జిల్లాకు చెందిన గుడివాడ, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన మానికొండ, కంకిపాడు వంటి ప్రధాన పట్టణం తదితర ప్రాంతాల నుంచి ప్రజలు విజయవాడకు రావాలంటే ఇది ప్రధాన రహదారి. ఈ రోడ్డుకు గుడివాడ నుంచి కోమటిగుంట లాకుల వరకు గల ప్రధాన రహదారి 23 కిలోమీటర్లు పొడవునా ప్రయాణం ప్రస్తుతం నరకాన్ని చూపిస్తోంది. రోడ్డుకు ఇరువైపులా కాల్వలు ప్రవహించడం కారణంగా తరుచూ గోతులమయం కావడం సర్వసాధారణం అయింది. దీనిని పునర్నిర్మించేందుకు అనేక అడ్డంకులు ఉన్నా ప్రభుత్వం దృష్టిపెడితే సాధ్యమయ్యే అంశమే. ఈ రోడ్డు నాలుగు నియోజకవర్గాల్లో విస్తరించి ఉంది. గుడివాడ, పామర్రు, గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు దృష్టిపెడితే గాని సాధ్యమయ్యేది కాదు. గత ప్రతిపక్షం విమర్శలను కట్టడి చేసేందుకు అప్పటి గుడివాడ అప్పటి ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఆయన పరిధిలోని పారుపూడి శివారు వరకు రూ.16 కోట్లతో రోడ్డుకు ఇరువైపులా ర్యాంప్‌లు నిర్మించి పగడ్బంధీగా రోడ్డు పూర్తిచేశారు. ప్రస్తుతం ఈ రోడ్డు వైపు కన్నెత్తి చూసే నాథుడే లేడు.

ఎన్నికల కోడ్‌తో ఆగిన పనులు

గత ప్రభుత్వం రోడ్లను పట్టించుకోవడం లేదు అని ఎత్తి చూపడంలో ప్రతిపక్షం, ప్రజాప్రతినిధులు దీనిని వజ్రాయుధంగా వాడుకున్నారు. ఏదిఏమైనా అధికారం చేపట్టిన కూటమి నాయకులు ఆ వజ్రాయుధాన్ని ఎక్కడ పెట్టారో కనిపించడం లేదని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. గత ఎన్నికలకు ముందు గుడివాడ, గన్నవరం ఎమ్మెల్యేలు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలిసి రోడ్డు నిర్మాణం కోసం రూ. 105 కోట్లు మంజూరు చేయించారు. టెండర్లు పిలిచేలోగా ఎన్నికల కోడ్ రావడంతో పనులు ప్రారంభించలేకపోయారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధులు ఆ నిధులను ఎందుకు వినియోగించుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రోడ్లు మరమ్మతులు చేయని ఎమ్మెల్యేలపై సీరియస్ అయ్యారంటూ కొన్ని పత్రికల్లో కథనాలు వస్తే ఈ రోడ్డు బాగుపడుతుందని భావించిన ప్రయాణికులకు నిరాశే మిగిలింది. కనీసం ఈ రోడ్డు పనులు ప్రారంభిద్దామని కూటమి ప్రజాప్రతినిధులు ఆలోచించకపోవడం విచారకరమని, వారు ఆరోపణలకే పరిమితం అవుతారు కాని ఫలితాలు సాధించలేరని ప్రయాణికులు విమర్శలు చేస్తున్నారు. సంక్రాంతి నాటికి పనులకు పునాది అయినా వేస్తారా అని ప్రశ్నిస్తున్నారు.

ఉన్న చిన్న అవకాశం పోయింది

ఈ ప్రాంతంలో ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు పారుపూడి నుంచి యలమర్రు మీదుగా మచిలీపట్నం-విజయవాడ హైవే ఎక్కి సుఖప్రయాణం చేసేవారు. ఇటీవల యలమర్రు వద్ద వంతెన ట్రాఫిక్ అధికమవ్వడం, ఇసుక ట్రాక్టర్ వెళ్లడంతో ఒక్కసారిగా వంతెన కుప్పకూలింది. దీంతో చిన్న కార్ల ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు తిరిగి అవస్తలు ఎదుర్కొనే పరిస్థితి దాపురించింది. ఇలాంటి పరిస్థితుల్లో తక్షణమే కంకిపాడు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డు దుస్థితిని గుర్తించాం

కంకిపాడు-మానికొండ రోడ్డు అవసరతను ప్రభుత్వం గుర్తించింది. ప్రత్యేక నిధులతో పనులు ప్రారంభించాల్సి ఉంది. ఆ దిశగా అడుగులు వేస్తున్నాం.

– కె. శ్రీనివాస్, డీఈ, ఆర్అండ్‌బీ

ఎంత మంది ప్రాణాలు కోల్పోతే స్పందిస్తారు?



ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యంతో ఈ గతుకుల రోడ్డులో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో గాయాలపాలయ్యారు. ప్రమాదాల కారణంగా వాహనాల యజమానులు లక్షల రూపాయలు నష్టపోతున్నారు. ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా ప్రజాప్రతినిధులుకాని, ప్రభుత్వ అధికారులు కాని, కూటమి నాయకులు ఈ విషయాన్ని పట్టించుకోకపోవడం దురదృష్టకరం. ఇంకెన్ని ప్రాణాలు పోతే వీరు పట్టించుకుంటారో తెలియడం లేదు.

– వై.వి.మురళీకృష్ణ, భవిష్యత్ భద్రతా దళం వ్యవస్థాపకుడు

ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం



సమస్యలను ప్రజా ప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లకపోవడమే ఈ దుస్థితికి కారణం. మానికొండ-కంకిపాడు రోడ్డు అధ్వాన స్థితిలో ఉన్నా పట్టించుకోకపోవడం దారుణం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గోతులు లేని రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని నాయకులు హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు పూర్తయింది. గోతులు పూడ్చాలంటూ సీఎం ఆదేశాలు ఇస్తున్నారు. అయినా అధికారులు, ప్రజల కష్టాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లకపోవడం ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం.

– కె.రవికుమార్, గుడివాడ

క్లుప్తంగా

వెనిగండ్ల రాము ఇచ్చిన హామీని నెరవేర్చాలి



గుడివాడరూరల్: ఎన్నికల ప్రచారంలో భాగంగా తాను గెలిస్తే టిడ్కో సముదాయాలకు సంబంధించి రుణమాఫీ చేస్తానని ఇచ్చిన హామీని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నెరవేర్చాలని టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ కార్యదర్శి బసవ అరుణ కోరారు. టిడ్కో రుణమాఫీ చేస్తానని వెనిగండ్ల రాము ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని కోరుతూ ఆ కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడ్కో గృహాలకు బ్యాంక్ అధికారుల బెదిరింపులు ఎక్కువ అయ్యాయన్నారు. ఎమ్మెల్యే రాము స్పందించి రుణమాఫీ చేసి ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా సముదాయం వద్ద అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించే విధంగా కృషి చేయాలన్నారు. అనంతరం బ్లాక్‌ల వారీగా కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులు అద్దాల లక్ష్మీ, వై.సత్యవతి, గోపాలకృష్ణ, లక్ష్మీ, సత్యవతి, రహీమున్నీసా తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్‌క్లబ్‌కు పతకాల పంట

గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ సేవా కార్యక్రమాలకు గాను నాలుగు ఉత్తమ సేవా పతకాలు అందినట్లు క్లబ్ అధ్యక్షుడు ఎం. శివరామకృష్ణ తెలిపారు. స్థానిక ఏలూరు రోడ్‌లోని కృష్ణమందిరంలో శుక్రవారం పతకాలను మీడియాకు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 సంవత్సరం సేవలను పురస్కరించుకుని ఉత్తమ క్లబ్, ఉత్తమ సేవ, ఉత్తమ వైద్య సేవలు, వితరణ తదితర అంశాలకు ఈ అవార్డులతో పాటు రూ.15 వేలు నగదు ప్రోత్సాహం పొందామన్నారు. కార్యక్రమంలో మాజీ గవర్నర్ పి. చంద్రశేఖరరావు, ఎంవీజే ఆంజనేయులు, వెంకటేశ్వరరావు, పి.కుటుంబరావు, వి.బ్రహ్మాజీ, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

కంప్యూటర్ల వితరణ

మండవల్లి: మండలంలోని అయ్యవారి రుద్రవరం ప్రాథమిక పాఠశాలకు రెండు కంప్యూటర్లు, ప్రింటర్ వితరణగా రిటైర్డ్ సెక్రెటరీ ఎర్రంశెట్టి విజయసారథి శుక్రవారం అందజేశారు. గ్రామ ప్రముఖుడు బొబ్బిలి రత్తయ్యనాయుడు ప్రోత్సాహంతో వీటిని అందజేసినట్లు తెలిపారు. సర్పంచ్ బోనం శేషగిరిరావు, మాజీ సర్పంచ్ పరసా వెంకయ్య, ఎంపీటీసీ సభ్యుడు శ్రీకృష్ణయాదవ్, పాఠశాల కమిటీ చైర్మన్ కట్టా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

గుడివాడరూరల్: దివ్యాంగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని గన్నవరం విమానాశ్రయం డైరెక్టర్ కామేపల్లి తులసీ అన్నారు. స్థానిక మార్కెట్‌యార్డ్‌లో బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి విజ్ఞప్తి మేరకు కేంద్ర ప్రభుత్వం కృత్రిమ అవయవాల తయారీ సంస్థ(ఆలింకో) సౌజన్యంతో మంజూరైన రూ.67,07,400 లక్షలు విలువజేసే ఉపకరణాలను సామాజిక అధికారిత శిబిర్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కామేపల్లి, మండల టీడీపీ అధ్యక్షుడు మురళీలు బాధితులకు బ్యాటరీతో నడిచే మూడు చక్రాల బండ్లు, మూడు చక్రాల సైకిళ్లు పంపిణీ చేశారు. ఆలింకో అధికారి రవి శంకర్, విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు కామరాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు




మొవ్వ: మండలంలోని మొవ్వ-కూచిపూడి రోడ్డులో, అయ్యంకి అడ్డ రోడ్డు-చినముత్తేవి రహదారుల్లో జరిగిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. శుక్రవారం ఉదయం కూచిపూడి నుంచి మొవ్వ వస్తున్న పవన్ అనే యువకుడు, రాంబాబు అనే వృద్ధుడు ద్విచక్రవాహనం పై వస్తుండగా సైకిల్ ఎదురు రావటంతో బండి స్కిడ్ అయి ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో పవన్‌కు కాలు విరిగింది. రాంబాబుకు గాయాలయ్యాయి. అలాగే ఓ యువకుడు చినముత్తేవి గ్రామంలో గల వంతెన వద్ద ఇసుక, చిప్స్ ఎక్కువగా ఉండటంతో ద్విచక్ర వాహనంపై నుంచి పడిపోయయాడు.

వర్గీకరణపై సమాచారం లేకుంటే ఎలా?

ముదినేపల్లి రూరల్: ఎస్సీ వర్గీకరణకు సంబంధించి గ్రామాల్లోని ఎస్సీలకు సమాచారం లేకుండా వర్గీకరణ ఏ విధంగా సాధ్యపడుతుందని వైఎస్సార్ సీపీ నాయకుడు నిమ్మగడ్డ భిక్షాలు ప్రశ్నించారు. ముదినేపల్లిలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ వర్గీకరణకు సంబంధించి అభిప్రాయాలు తెలియజేయడంతో పాటు నిజమైన ఎస్సీలు పేర్లు నమోదు చేసుకోవాలని కమిషన్ పేర్కొన్నట్లు చెప్పారు. అనేక గ్రామాల్లో మాలలు మాదిగలుగాను, మాదిగలు మాలలుగాను గతంలో నమోదైనట్లు తెలిపారు. ఈ జాబితాల వలన వర్గీకరణకు న్యాయం చేకూరదన్నారు. కమిషన్ స్పందించి వర్గీకరణ నిష్పక్షపాతంగా జరిగేందుకు గడువును పెంచాలని కోరారు.

జూదరుల అరెస్టు

గుడ్లవల్లేరు: మండలంలోని వడ్లమన్నాడు మురుగు కాల్వ గట్టున కోత ముక్క ఆడుతూ నలుగురు జూదరులు శుక్రవారం పోలీసులకు పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి రూ.1,820ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

ఇసుక మాఫియా బరితెగింపు

సర్వేను అడ్డుకున్న రైతులు



సర్వే బృందాన్ని అడ్డుకున్న రైతులు

తోట్లవల్లూరు: ఇసుక మాఫియా బరితెగింపును రైతులు అడ్డుకున్న ఘటన మండలంలోని రొయ్యూరు శివారు తోడేళ్లదిబ్బలంకలో శుక్రవారం జరిగింది. లీజుకు తీసుకున్న ప్రాంతం ఒకటైతే, మరో చోట రైతుల పొలాల్లో సర్వే హద్దులు నిర్ణయించటంపై రైతులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. రొయ్యూరు శివారు తోడేళ్లదిబ్బలంక గ్రామానికి సమీపంలోని నార్తువల్లూరు రెవెన్యూ ప్రాంతంలో రాజా బొమ్మదేవర వెంకటనరసింహకు చెందిన 14.27 ఎకరాల భూమిని ఇసుక మాఫియా ఇసుక తవ్వకాల కోసం లీజుకు తీసుకుంది. దీనికి సంబంధించి సీతారెడ్డి అనే వ్యక్తి కొంత మంది ప్రైవేటు సర్వే బృందంతో శుక్రవారం వచ్చి సర్వేకు ఉపక్రమించాడు. అయితే రాజా బొమ్మదేవర వెంకట నరశింహ పొలం ఉండేది కృష్ణానది పాయలో ఆర్ఎస్ నంబరు 355-2లో కాగా, సర్వే హద్దులను తీసుకొచ్చి నది మెరక ప్రాంతంలో ఆర్ఎస్ నెంబరు 354లో ఉన్న గంగిశెట్టి సత్యనారాయణ, గంగిశెట్టి నాంచారయ్య పొలాల్లో ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న రైతులు సీతారెడ్డి బృందాన్ని నిలువరించి, ప్రశ్నల వర్షం కురిపించారు. తహసీల్దార్ కుసుమకుమారికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. తమ పొలాల్లో హద్దులు వేయటానికి మీరెవరంటూ సీతారెడ్డి బృందానికి ముచ్చెమటలు పట్టించారు. ఈ విషయమై జనసేన మండల కార్యదర్శి, రైతు గంగిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఇసుక మాఫియా ముసుగులో తమ పొలాల్లో హద్దులు వేయించటం టీడీపీ నాయకులకు తగదని అన్నారు. దీనిపై ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాకు ఫిర్యాదు చేశామని, అవసరమైతే కలెక్టర్ దృష్టికి కూడా తీసుకువెళతామని పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యానికి కూటమి ప్రభుత్వం తూట్లు

గుడ్లవల్లేరు: ప్రజాస్వామ్యానికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు నాగు ఆవేదన వ్యక్తం చేశారు. చినగొన్నూరులో ఉపాధి హామీ నిధులతో నిర్మిస్తున్న రెండు సీసీ రోడ్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో తమను భాగస్వామ్యం చేయకపోగా కనీసం సమాచారం కూడా లేకుండా పనులు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చినగొన్నూరుకు తాను సర్పంచ్‌గా ఎన్నికైన విషయాన్ని కూడా కూటమి నాయకులతో పాటు అధికారులు కూడా ఆదమరచారని ఆరోపించారు. ఇదే ధోరణిలో ప్రవర్తిస్తే తమ పార్టీ తరపున తిరుగుబాటు తప్పదని నాగు హెచ్చరించారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఎగ్జిబిట్



పమిడిముక్కల: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి మౌనిష్ తయారు చేసిన స్మార్ట్ ప్యాడీ షెల్టర్ రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. గుడివాడ మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో పమిడిముక్కల విద్యార్థి మౌనిష్ తయారు చేసిన స్మార్ట్ ప్యాడీ షెల్టర్ ఎగ్జిబిట్ జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించింది. డీఈఓ రామారావు, జిల్లా సైన్స్ అధికారి జాకీర్ అహ్మద్, డీవైఈఓ పద్మారాణి మౌనిష్‌ను అభినందించి బహుమతి అందజేశారు. ఈ ప్రాజెక్టును రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. పమిడిముక్కల హైస్కూల్లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మౌనిష్‌ను, ఎగ్జిబిట్ తయారు చేయుటకు గైడ్ టీచరుగా వ్యవహరించిన సురేష్‌కుమార్‌ను ఎంఈఓ శ్రీనివాస్, హెచ్ఎం కేశవనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.

పీఎంశ్రీ పనులు పూర్తి చేయండి

కైకలూరు: ప్రైమ్ మినిస్టర్స్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకంలో పాఠశాలల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఏలూరు జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అడిషనల్ కో-ఆర్డనేటర్ కె.పంకజ్ కుమార్ ఆదేశించారు. ఆటపాక నిమ్మగడ్డ నాగభూషణం ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో పీఎంశ్రీ పనులను శుక్రవారం పరిశీలించారు. ఎంఈఓ రెడ్డి రామారావు, హెచ్ఎం ముబీన్ బేగం పాల్గొన్నారు.

మహిళలకు గుర్తింపు తెచ్చిన సావిత్రీబాయి పూలే



గుడివాడలో సావిత్రిబాయి పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

గుడివాడ టౌన్: మన దేశంలో మహిళలకు గుర్తింపు వచ్చిందంటే అందుకు కారణం సావిత్రీబాయి పూలే అని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు అన్నారు. స్థానిక మెయిన్ రోడ్‌లోని జ్యోతీరావ్ పూలే-సావిత్రీబాయి పూలే కాంస్య విగ్రహాల వద్ద బీసీ సంఘం ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలుగా సావిత్రీబాయి పూలే గుర్తించబడిన మహిళ అని పేర్కొన్నారు. బీసీ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెంకట మల్లేశ్వరరావు, బి.సోమశేఖర్, డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్, ఎస్కే సయ్యద్, టీవీ రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉరుటూరులో..

ఉరుటూరు(పామర్రు): మహిళా విద్యా వికాసానికి సేవ చేసిన సావిత్రీ బాయిపూలే ఎంతో మందికి ఆదర్శమని పామర్రు ఘంటసాల కళాపీఠం అధ్యక్ష,కార్యదర్శులు కాటూరి వెంకటమురళీకృష్ణ, నందిపాటి హేమంత్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఉరుటూరు ప్రాథమిక ఉన్నత పాఠశాల్లో సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా శుక్రవారం మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. గ్రామసర్పంచ్ ముప్పిడి శ్రీ నవత, వాసవీ జాగృతి ఇంటర్నేషన్ ప్రెసిడెంట్ కొలిపర అనసూయ పాల్గొన్నారు.

మొవ్వలో..

పెదపూడి(మొవ్వ): స్థానిక వేమూరి సుందర రామయ్య ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల, పెదపూడి అప్పర్ ప్రైమరీ పాఠశాల్లో సావిత్రిబాయి పూలే జయంతిని శుక్రవారం నిర్వహించారు. పెదపూడిలో జరిగిన కార్యక్రమంలో యూటీఎఫ్ మండల శాఖా సభ్యులు మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు రవీంద్ర బాబు, రమేష్ బాబు, శివకుమార్, రవిబాబు, నాగమల్లేశ్వరరావు, హెచ్ఎం కరుణాకరరెడ్డి పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే సేవలు మరువలేనివి

ముదినేపల్లి రూరల్: మహిళా విద్యాభివృద్ధికి సావిత్రిబాయి చేసిన పూలే సేవలు మరువలేనివని ఏపీటీఎఫ్ జిల్లా నాయకుడు బేతాల రాజేంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని వడాలి జెడ్పీ హైస్కూల్లో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని శుక్రవారం నిర్వహించారు. అనంతరం హైస్కూల్లోని మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. ఆ సంఘ నాయకులు సీహెచ్ నాగమల్లేశ్వరరావు, కృపాకర్, వెంకటరత్నం పాల్గొన్నారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: మండలంలోని బొడ్డపాడు ఎంపీయూపీ పాఠశాల్లో సావిత్రిబాయి పూలే జయంతి శుక్రవారం జరిగింది. సర్పంచ్ మూడే శివశంకరరావు, ఎన్టీఆర్, ఘంటసాల కళాపీఠం అధ్యక్షుడు వెంకటమురళీకృష్ణ సహకారంతో హెచ్ఎం జయరాజు ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు.

కైకలూరులో..

కైకలూరు: వేమవరప్పాడు ఎంపీయూపీ పాఠశాల్లో సావిత్రిబాయి పూలే జయంతి శుక్రవారం నిర్వహించారు. అనంతరం విశ్రాంత పంచాయతీ సెక్రటరీ అడవి ప్రసాద్ ఆర్థిక సాయంతో పాఠశాల మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు.

సేవా సంస్థ ఆధ్వర్యంలో..

స్థానిక మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. మహిళా టీచర్ కనకదుర్గను సన్మానించారు. సంస్థ చైర్మన్ కొండ్రెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో విద్యార్థికి బంగారు పతకం



క్రీడాకారుడు అస్టిన్‌ను అభినందిస్తున్న హెచ్ఎం స్రవంతి తదితరులు

గుడివాడ టౌన్: రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో తమ విద్యార్థి బంగారు పతకం సాధించారని ఆంధ్ర నలంద మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం స్రవంతి తెలిపారు. శుక్రవారం పాఠశాలలో బంగారు పతకం సాధించిన చేజ్ అస్టిన్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల చిత్తూరులో జరిగిన బాస్కెట్‌బాల్ పోటీలలో అస్టిన్ కృష్ణాజిల్లా జట్టులో ఆడి విజయం సాధించినట్లు పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

■ తాగునీటి చెరువు గట్ల శుభ్రం

మండవల్లి: మండలంలోని పెరికెగూడెం గ్రామంలోని తాగునీటి చెరువు గట్లను సర్పంచ్ పెరుమాళ్ల పద్మ ఆధ్వర్యంలో శుక్రవారం కూలీలు బాగు చేశారు. పిచ్చిమొక్కలు, చెత్తను తొలగించి శుభ్రం చేశారు.

■ బీజేపీ మండల అధ్యక్షుడిగా వాసుపల్లి

నందివాడ: గుడివాడ నియోజకవర్గ బీజేపీ అధ్యక్షుడు గుత్తికొండ రాజబాబు ఆధ్వర్యంలో నందివాడ మండలం పార్టీ అధ్యక్షుడిగా వాసుపల్లి రాంప్రసాద్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పలువురు నేతలు రాంప్రసాద్‌ను అభినందించారు.

■ గుడ్లవల్లేరు మండల అధ్యక్షుడిగా నగేష్

గుడ్లవల్లేరు: బీజేపీ మండల అధ్యక్షుడిగా శేషం నగేష్‌ను నియమించారు. ఆయనకు శుక్రవారం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అట్లూరి దిలీప్‌కుమార్ నివాసంలో బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు.

■ పామర్రు మండల అధ్యక్షుడిగా శివకృష్ణ

పామర్రు: బీజేపీ మండలం అధ్యక్షుడిగా ఎం.శివకృష్ణ ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి గజేంద్ర శుక్రవారం తెలిపారు. పామర్రులో ఆయన మాట్లాడుతూ పార్టీ అంతర్గత ఎన్నికల్లో భాగంగా మండలం పెదమద్దాలికి చెందిన శివకృష్ణను అధ్యక్షుడిగా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

■ నూతన కార్యవర్గం ఎంపిక

గుడివాడ టౌన్: బీజేపీ గుడివాడ పట్టణ నూతన కార్యవర్గ ఎంపిక శుక్రవారం స్థానిక ఎన్జీఓస్ హోమ్‌లో జరిగింది. జిల్లా అధ్యక్షుడు శ్రీరాజబాబు అధ్యక్షతన జరిగిన ఈ ఎన్నికలో గుడివాడ-1 అధ్యక్షుడిగా కె. దుర్గాప్రసాద్, గుడివాడ-2 అధ్యక్షుడిగా రామకృష్ణ నియమితులయ్యారు.

■ మినుము పంటలో లద్దెపురుగు ఉధృతి

పమిడిముక్కల: ప్రస్తుతం మినుము పంటలో పొగాకు లద్దె పురుగు ఉధృతి అధికంగా ఉందని, నివారణకు వేప సంబంధిత మందులను ఎకరానికి ఒక లీటర్ చొప్పున పిచికారీ చేసుకోవాలని ఏఓ గణేష్‌రెడ్డి సూచించారు. మండలంలోని హనుమంతపురంలో శుక్రవారం మినుము పంటను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పురుగు అధికంగా ఉంటే ఇమామెక్టిన్ బెంజోయేట్ 80గ్రాములు ఎకరానికి పిచికారీ చేసుకోవాలన్నారు.

■ ధనుర్మాస పూజలు

పామర్రు: స్థానిక విష్ణాలయంలో ధనుర్మాసం పురస్కరించుకుని భక్తుల ఆధ్వర్యంలో శుక్రవారం విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేణుగోపాల, గోదాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. జమీదగ్గుమిల్లి సీతారామాంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.

■ సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ కృషి

తోట్లవల్లూరు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ కృషి చేస్తోందని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు పీకా ఇమ్మానుయేలు తెలిపారు. చిన పులిపాక, వల్లూరుపాలెం, తోట్లవల్లూరు, చాగంటిపాడు, భద్రిరాజుపాలెం, పెనమకూరు, కుమ్మమూరు, గరికపర్రులో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం శుక్రవారం జరిగింది.

■ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి

మండవల్లి: రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ కె.గోపాల్ అన్నారు. అయ్యవారి రుద్రవరంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ఉన్న రెవెన్యూ పరమైన సమస్యలను పరిష్కరించేందుకే ఈ సదస్సులను చేపట్టినట్లు తెలిపారు. రీసర్వే డీటీ సుధారాణి, ఆర్ఐ శ్రావణి పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: రైతుల శ్రేయస్సు కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామసభలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జీఎస్ సుభానీ అన్నారు. గురజ, పెనుమల్లి గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభ శుక్రవారం నిర్వహించారు.

నందివాడలో..

నందివాడ: ప్రజలకు రెవెన్యూ సేవలు అందించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నట్లు డీఐఓ జోజిబాబు తెలిపారు. మండలంలోని చిన్నలింగాలలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సర్పంచ్ చిన్నా రాంబాబు పాల్గొన్నారు.

■ మొగలి చెరువు గట్ల ప్రక్షాళన

మండవల్లి: తాగునీటి చెరువు (మొగలి చెరువు) గట్లను సర్పంచ్ మెండా ఝాన్సీ ఆధ్వర్యంలో శుక్రవారం బాగు చేయించారు. కార్యదర్శి సాయిప్రదీప్, సురేష్ పాల్గొన్నారు.